క్లుప్తంగా

ఓపెన్ డిగ్రీలో అడ్మిషన్లు ప్రారంభం

మిర్యాలగూడ అర్బన్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్శిటీ దూర విద్యలో చదువాలనుకునే వారికి పట్టణంలోని కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్ నర్సింగ్ కోటయ్య తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఏ, బీకాం, బీఎస్సీ అడ్మిషన్లు పొందాలంటే ఏదేని గ్రూప్‌లో ఇంటర్ ఉత్తీర్ణులైన ఉండాలని, బీఎస్సీ ప్రవేశానికి ఇంటర్ సైన్స్, మ్యాథ్స్ గ్రూప్ అభ్యర్థులు అర్హులని, అంతేగాకుండా పదో తరగతి తరువాత రెండేళ్ల ఒకేషన్ కోర్సుల చేసిన వారు కూడా అర్హులేనన్నారు. అడ్మిషన్లు పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉంటాయని, పూర్తి వివరాలకు స్టడీ సెంటర్ సెల్: 7382929640 నంబర్ కు సంప్రదించాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

త్రిపురారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు(బుధవారం) ఎంపీపీ అనుముల పాండమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలు మంగమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులతో పాటుగా మండల స్థాయి అధికారులు పూర్తిస్థాయి నివేదికతో హాజరు కావాలని పేర్కొన్నారు.

మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా షేక్ జాను



నియామకపత్రం అందుకుంటున్న జాను

మిర్యాలగూడ : మహిళా కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా పట్టణానికి చెందిన షేక్ జాను నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీతరావు ఆమెకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ జాను మాట్లాడుతూ . మహిళలంతా కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండేలా పాటుపడుతానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని వినతి

అడవిదేవులపల్లి : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరుతూ మంగళవారం మండల తహసీల్దార్ దేశ్యానాయక్‌కు ప్రజా సంఘాల వేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుర్ర శివనాయక్ మాట్లాడారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వడంలో పాలక ప్రభుత్వాలు పూర్తిగా విఫలమైయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు సర్వయ్య, కేవీపీఎస్ మండల నాయకులు రాంబాబు, పిట్టల వెంకయ్య, హనుమంతు, రంగానాయక్, సైదులు, కోటి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీ ఎన్నిక

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలోని గుమ్మడవెల్లి గ్రామ శాఖ ఎమ్మార్పీఎస్ కమిటీని దేవరకొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోతెం సహదేవుడు ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా నాస లింగమయ్య, గౌరవ అధ్యక్షుడిగా నాస అంజయ్య, ఉపాధ్యక్షుడిగా జినుక సాయన్న, ప్రధాన కార్యదర్శిగా జినుక లింగమయ్య, సహాయ కార్యదర్శిగా ఆదిరాల గణేశ్, అధికార ప్రతినిధిగా జినుక ప్రభులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారుపాక గోపాల్, అంకూరి నాగరాజు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తాం



ఆంధ్రా–తెలంగాణ సరిహద్దులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

నాగార్జునసాగర్ : నంబర్‌ప్లేట్లు లేకుండా వాహనాలను నడిపితే సీజ్ చేస్తామని నాగార్జునసాగర్ సర్కిల్ సీఐ బీసన్న తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆంధ్రా–తెలంగాణ సరిహద్దులో వాహనాలను తనిఖీ చేశారు. మూడు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రతి వాహనదారుడు నంబర్ ప్లేట్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చాలామంది వాహనాలకు నంబరుప్లేట్ లేకుండా తిరుగుతున్నారని వారంతా శిక్షార్హులవుతారన్నారు. ఈ తనిఖీలలో విజయపురి టౌన్ ఎస్ఐ సురేశ్, పోలీసులు పాల్గొన్నారు.

రోడ్డు పనులకు మోక్షం

- నర్సింహులగూడెం –మాదారం రహదారి పనులు ప్రారంభం
- రూ.7కోట్లతో 22కిలో మీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు, విద్యార్థులు



మొదలైన రోడ్డు నిర్మాణ పనులు

నిడమనూరు: పదేళ్లుగా ఎదురుచూస్తున్న నర్సింహులగూడెం–మాదారం రోడ్డు పనులకు మోక్షం లభించింది. మండలంలోని వివిధ గ్రామాలను కలుపుతూ నల్లగొండకు వెళ్లే వారికి ఈ రహదారి గుండానే వెళ్తుంటారు. అయితే రహదారి మొత్తం ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. అయితే రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా టెండర్‌కు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడమే అలస్యానికి కారణం. ఒక్కరిద్దరూ టెండర్ వేసినా అది తక్కువగా కోట్ చేయడంతో ఖరారు కాలేదని సమాచారం . నర్సింహులగూడెం నుంచి మాదారం రోడ్డు వరకు ఉన్న 22 కిలోమీటర్ల రోడ్డుకు ప్రభుత్వం రూ.7కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ఖరారుకు సంవత్సరాల పాటు వేచి చూడాల్సి వచ్చింది. ఈ సమయంలో ధ్వంసమైన రోడ్డు మీదుగా వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎన్నోసార్లు నిడమనూరు, ముప్పారం నలగొండ బస్సు రోడ్డు సక్రమంగా లేదని బస్సు సర్వీస్‌ను రద్దు చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. కొన్నిసార్లు నల్లగొండ నుంచి నిడమనూరుకు వరకు రావాల్సిన బస్సు మధ్యలోని గ్రామాల వరకే వచ్చి తిరిగి నల్లగొండకు వెళ్లి పోయేది.

ఇబ్బందులు పడిన ప్రజలు

కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి (నర్సింహులగూడెం) నుంచి మాదారం వరకు బీటీ రోడ్డు పనులు చేపడుతుండడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు సైతం బస్సు సర్వీసు రద్దు అయినప్పుడు ఆటోలను ఆశ్రయించాల్సి వచ్చేది. రోడ్డు పనులు పూర్తి అయితే మండలంలోని ముప్పారం, గుంటుకగూడెం, లక్ష్మీపురం, ఊట్కూర్, నందికొండవారి గూడెం, గోపువారి గూడెం, ఎర్రబెల్లి, మారుపాక, ఎర్రగూడెం గ్రామాల వారికి ఇబ్బందులు తప్పుతాయి. అధికార పార్టీ నాయకులు ఎమ్మెల్యే నోముల భగత్‌కు తమ సమస్యలను వివరించడంతో సంబంధిత కాంట్రాక్టర్‌ను ఒప్పించి పనులు ప్రారంభం కావడానికి చొరవ తీసుకున్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



ఇన్నాళ్లు పడ్డ బాధలు తీరనున్నాయి. రోడ్డు సక్రమంగా లేక వాహనాలు ప్రమాదాలకు గురయ్యేవి. రోడ్డు పనులు చేపట్టడం వల్ల సమస్యలు తీరుతాయి . అలాగే రోడ్డు పనులు త్వగా పూర్తి చేయాలి.అ లాగే ప్రజలకు, విద్యార్థులకు అనుకూలంగా ఉంటుంది.

– చర్క శంకర్, సోమోరిగూడెం

సమస్య తీరనున్నది

రోడ్డు పనులు పూర్తయితే ఎన్నో గ్రామాల సమస్య తీరనున్నది. ధ్వంసమైన రోడ్ల మీద ప్రయాణం చేయలేక చాలా మంది ఇబ్బంది పడ్డారు. బస్సు సర్వీస్ నిలపడంతో ఆటోలపై ఆశ్రయించాల్సి వచ్చేది. ఇప్పుడు రోడ్డు పనులు త్వరగా పూర్తి చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది.

– మేరెడ్డి వెంకటరమణ, శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్

సామాజిక సేవే బుసిరెడ్డి ఫౌండేషన్ లక్ష్యం



హాలియా : విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి

హాలియా : సామాజిక సేవే బుసిరెడ్డి ఫౌండేషన్ లక్ష్యమని ఆ ఫౌండేషన్ చైర్మన్, ప్రముఖ వైష్ణవి బిల్డర్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అనుముల హైస్కూల్ విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేసి మాట్లాడారు. సమాజ సేవతోనే మనిషికి ఎంతో తృప్తి, ఆనందం కలుగుతుందన్నారు. బుసిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇప్పటికే అనేక సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం 203 మంది విద్యార్థులకు బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వెంపటి పార్వతమ్మ శంకరయ్య, ఎంఈఓ బాలునాయక్, తిరుమలగిరి మండల వైస్ ఎంపీపీ దిలీప్‌రెడ్డి, హెచ్ఎం కృష్ణమూర్తి, చంద్రుడు, మధు, నాయకులు బుర్రి రాంరెడ్డి, ముస్తాఫా, శ్రీనాథ్, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, ఫౌండేషన్ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

చదువుతోనే గుర్తింపు, గౌరవం

త్రిపురారం : ఉన్నతమైన చదువులతోనే సమాజంలో తగిన గుర్తింపు, గౌరవం వస్తుందని బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని దుబ్బ మీద మండల ప్రాథమిక పాఠశాల, కంపాసాగర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బుసిరెడ్డి ఫౌండేసన్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగ్‌లు పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. పిల్లలు ప్రతి రోజు పాఠశాలలకు వెళ్లే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. బుసిరెడ్డి పాండు రంగారెడ్డి సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మార్తి భారత్ రెడ్డి, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు అనంత రెడ్డి, శ్యాం సుందర్ రెడ్డి, గోపు కోటిరెడ్డి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకే పోటీలు

త్రిపురారం : గ్రామీణ ప్రాంతాల్లోని యువతల్లో దగి ఉన్న క్రీడానైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడా పోటీలు ఎంతగానో దోహదం చేస్తాయని బుసిరెడ్డి ఫౌండేషన్ ఫౌండర్ పాండురంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బుసిరెడ్డి ఫౌండేషన్, అరుణ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మార్తి భారత్ రెడ్డి, అనంత రెడ్డి, శ్యాం సుందర్ రెడ్డి, అరుణ్ రెడ్డి, వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి



ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

దేవరకొండ : దేవరకొండ ఏరియాస్పత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములునాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. వైద్యులు సమయపాలన పాటించడంతో పాటు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు. వైద్యులు సమయపాలన పాటించకపోవడంతో రోగులు సమయానికి వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారని, రక్త, మూత్ర పరీక్షలకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు చొల్లేటి భాస్కరాచారి, విఠలాచారి, కూరెల్లి కృష్ణమాచారి, రాచమళ్ల నాగయ్య, తోటపల్లి శ్రీను, సురేష్, శ్రీను, అబ్దుల్ కలాం, శ్రీరామదాసు రామాచారి, మాతంగి శ్రీను, జానునాయక్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మౌలిక వసతుల కల్పనకు కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ బాలాజీనాయక్

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలికవసతుల కల్పనకు ప్రత్యేకంగా కృషి చేస్తానని ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్ అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఆరోగ్య కేంద్రానికి కావాల్సిన కుర్చీలు, ల్యాబ్ నిర్వహణకు ఇంటర్నెట్, తాగునీరు సదుపాయం కోసం ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. అనంతరం కంటి వెలుగు కార్యక్రమంలో వైద్య సేవలను అందించిన వైద్యాధికారులు, వైద్య సిబ్బందిలకు ప్రజా ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యకమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కేసా రవి, ఎంపీడీఓ మహ్మద్ షరీఫ్, తహసీల్దార్ దేశ్యానాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, వైస్ ఎంపీపీ కూరాకుల మల్లేశ్వరీ, వైద్యాధికారి డాక్టర్ ఉపేందర్, స్థానిక సర్పంచ్ కొత్త మర్రెడ్డి, సీహెచ్ఓ షాహిద్‌లతో పాటు ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆఫ్‌లైన్ ప్రవేశాలకు అవకాశం ఇవ్వాలి

మిర్యాలగూడ అర్బన్ : బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థుల కు ఆన్‌లైన్ ప్రవేశాలు కాకుండా ఆఫ్‌లైన్‌లో నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఖమ్మంపాటి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి గ్రామీణ విద్యార్థులు పట్టణంలో ఉన్నత చదువులు చదవాలంటే ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు కట్టకలేక ప్రభుత్వ హాస్టళ్లలో ఉండి చదువుతారని అలాంటి వారికి ఇబ్బంది కలిగేలా ఆన్‌లైన్ విధానం నిర్ణయించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ,కుర్ర సైదానాయక్, జగన్, వీరన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీ



మిర్యాలగూడ టౌన్: విద్యార్థినికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న నాబార్డు ఆర్ఎం వినయ్



హాలియాలో విద్యార్థులకు ప్రశంసా పత్రాలను ప్రదానం చేస్తున్న డీసీసీబీ మేనేజర్ అలివేలు



పెద్దవూర : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఏపీజీవీబీ మేనేజర్ బాబురావు

మిర్యాలగూడ టౌన్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై ఆర్‌బీఐ ఆదేశానుసారం క్విజ్ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు అక్షర, ఎస్‌కె టైసిన్ ప్రథమ స్థానంలో నిలిచారు. వీరికి నాబార్డు రీజినల్ మేనేజర్ (ఆర్ఎం) వినయ్, ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ రమ్యశ్రీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బాలికను పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో బకల్‌వాడీ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రహీం, గోపారపు రాజు పాల్గొన్నారు.

హాలియా : ఆర్‌బీఐ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై విద్యార్థులకు మంగళవారం స్థానికంగా మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎన్‌డీసీసీబీ మేనేజర్ అలివేలు బహుమతులను ప్రదానం చేశారు. క్విజ్ పోటీల్లో మొదటి బహుమతి చల్మారెడ్డిగూడెం జెడ్పీహెచ్ఎస్, ద్వితీయ బహుతి జెడ్పీహెచ్ఎస్ హాలియా, తృతీయ బహుమతి కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు గెలుపొందారు. వీరికి ప్రథమ రూ.5వేలు, ద్వితీయ రూ.4వేలు, తృతీయ 3వేల నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో హాలియా హైస్కూల్ హెచ్ఎం గుండా కృష్ణమూర్తి, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు అక్కయ్యబాబు, మంద సైదులురావు గౌతమ్, లింగయ్య, చైతన్య ఉన్నారు.

నిడమనూరు : నిడమనూరు, త్రిపురారం మండలాలకు చెందిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఆర్‌బీఐ వారి ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను నిర్వహించారు. నిడమనూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై ఈ పోటీలు నిర్వహించిన విజేతలకు బహుమతులు ప్రశంసా పత్రాలు అందజేశారు. మొదటి బహుమతి నిడమనూరు ఉన్నత పాఠశాల, రెండో బహుమతిగా కేజీబీవీ నిడమనూరు, మూడో బహుమతి రాజన్నగూడెం ఉన్నత పాటశాల విద్యార్థులు గెలుచుకోగా వారికి అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి రూ.250 నగదుతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నిడమనూరు ప్రభుత్వ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె.నర్సిరెడ్డి, డి సైదా, కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ నోడల్ ఆఫీసర్ పల్లవి, ఎస్‌బీఐ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దవూర : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యతపై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) ఆధ్వర్యంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) ఆదేశానుసారం క్విజ్ పోటీలు నిర్వహించారు. పెద్దవూర, పెదఅడిశర్లపల్లి మండలాలల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీలలో 60మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని పెద్దవూర, ద్వితీయ బహుమతిని పీఏపల్లి మండలం అజ్మాపురం, తృతీయ బహుమతిని వెల్మగూడెం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల విద్యార్థులు గెలుపొందారు. గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎం కె.శ్రీనివాస్, ఏపీజీవీబీ బ్యాంకు మేనేజర్ బాబురావు, హెచ్ఎంలు జార్జి, హిమవంతరెడ్డి, ఉపాధ్యాయులు శైలజ, రామ్మోహన్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

గుర్రంపోడు : ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై ఆర్‌బీఐ నిర్ణయించి క్విజ్ పోటీలను మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించారు. ఈ పోటీలో గుర్రంపోడు, కనగల్ మండలాలకు చెందిన పలు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి స్థానం పొందిన మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని ఆర్. ధరణి, ఎనిమిదో తరగతి విద్యార్థిని ఎం. ప్రభాస్, రెండో స్థానంలో రేగట్టె ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.వంశీ, టి.వెంకన్న, మూడో స్థానంలో కనగల్ టీఎస్ఎంఎస్ విద్యార్థులు టి.శివ, పి.జగతిరాజ్‌లకు ప్రశంసాపత్రాలను హెచ్ఎం రాములు అందజేశారు. మోడల్ స్కూల్ అధ్యాపకుడు కరుణాకర్ పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : దామరచర్ల మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఆర్థిక అక్షరాస్యత అనే అంశంపై విద్యార్థులకు క్విజ్ పోటీ మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో అడవిదేవుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలకు చెందిన విద్యార్థులు మూడో బహుమతి గెలుచుకున్నట్లు ఆ పాఠశాల హెచ్ఎం అబ్బాస్ అలీ తెలిపారు. ప్రతిభాను కనబరిచిన విద్యార్థులను ఎస్ఎంసీ చైర్మన్ పి. శ్రీనివాస్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

అన్ని దానాలకంటే రక్తదానం గొప్పది



మాట్లాడుతున్న సామాజిక కార్యకర్త డాక్టర్ రాజు

మిర్యాలగూడ టౌన్ : అన్ని దానాలకంటే రక్తదానం ఎంతో గొప్పదని సామాజిక వేత్త డాక్టర్ జాడీ రాజు, డాక్టర్ మునీర్‌లు అన్నారు. మంగళవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆర్టీసీ డిపో మేనేజర్ బొల్లెద్దు పాల్ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ శిబిరానికి యువకులు, ప్రయాణికులు, ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులు, స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో విధులను నిర్వర్తించిన అనంతరం శిబిరానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు మౌనిక, ల్యాబ్ టెక్నీషియన్ అలీ, జ్యోతి, స్టాఫ్ నర్సు భార్గవి, ఆర్టీసీ సీఐ సంధ్యారాణి తదితరులున్నారు.

హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి

మిర్యాలగూడ టౌన్ : సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు మెస్ చార్జీలను పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పట్టణంలోని బాలికల వసతి గృహంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో ఉండి విద్యను అభ్యసిస్తున్న నిరుపేద విద్యార్థులకు మెస్ చార్జీలను 25శాతం పెంచుతామని మంత్రి వర్గ ఉపసంఘం నిర్ణయించి ఆమోదం తెలిపిందని తెలిపారు. ఆ జీఓను కూడా ఇంకా విడుదల చేయలేదన్నారు. ఈ సమావేశంలో ఈ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, ఉరిబండి శ్రీనివాస్ యాదవ్, భూమిక, పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ



మాట్లాడుతున్న కుందూరు జైవీర్‌రెడ్డి

గుర్రపోడు : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీని అములు చేస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. గిరిజన సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపటిన రెండో విడత గిరిజన చైతన్య పాదయాత్ర మంగళవారం మండలంలోని గాసీరాంతండా, తేపల్లి తండాలో సాగింది. ఈ సందర్భంగా జైవీర్ రెడ్డి మాట్లాడుతూ. ఎన్నికల హామీని విస్మరించిన బీఆర్ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షుడు అగుల్ల సర్వయ్య, లింగా రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సుదిని జగదీశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, గణేష్ నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా స్పోర్ట్స్ అసోసియేషన్



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎస్‌వీటి

దేవరకొండ : క్రీడాకారులకు అండగా దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఉంటుందని ఆ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్‌వీటి తెలిపారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, క్రీడాకారులు తమలోని నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు సమ్మర్ క్యాంప్‌లు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కృష్ణకిశోర్, తాళ్ల శ్రీధర్‌గౌడ్, ఏఎ రవికుమార్, ఉమామహేశ్వర్, లెండాల మోహన్‌రావు, కరాటే మాస్టర్ శ్రీను, వెంకట్, జగన్, శంకర్, బాలు, రమేశ్, ప్రసన్న, మహేశ్వరి, ధనుష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, సంక్షేమ వసతి గృహం ఏర్పాటు చేయాలని ఎన్ఎస్‌యూఐ తెలంగాణ స్టేట్ కో–ఆర్డినేటర్ ఎండీ.ఖదీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో సుమారు వేయి మంది విద్యార్థులు పదో తరగతి విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ప్రభుత్వ జూనియర్ కళాశాల, వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రమేశ్‌నాయక్, నాగేంద్ర, ఆంజనేయులు, పంగ శివ పాల్గొన్నారు.

అక్రమ ఫీజులను నియంత్రించాలని ధర్నా

మిర్యాలగూడ టౌన్ : ప్రైవేట్ విద్యా సంస్థలో అక్రమ ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ టీఎన్ఎస్ఎఫ్ (తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం డీఏఓ రాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ సైదులు మాట్లాడారు. ఫీజులు, పుస్తకాలు, బస్సు ఫీజులు, డ్రెస్‌ల పేరుతో విద్యార్థుల నుంచి భారీ మొత్తంలో వసూలు చేస్తున్నప్పటికీ విద్యాశాఖాధికారులు నిమ్మకునీరేత్తినట్ల వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు నాగేందర్, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా నాయకులు రమేశ్, నవీన్, రఘు, రాజేష్, చావల వెంకటేశ్వర్లు, రాజు, రాజేష్ పాల్గొన్నారు.

ఇంటింటికి బీజేపీ

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ ప్రభారీ లచ్చిరెడ్డి, ఏడుకొండలు, సీతారాంరెడ్డి, రవీందర్, గొడుగు తిరుపతి, గణేష్ పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా మారుద్దాం



మాట్లాడుతున్న ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు

దేవరకొండ : నాటు సారా రహిత గ్రామాలుగా మార్చుకుందామని దేవరకొండ ఎక్సైజ్ సీఐ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండ మండలంలోని మర్రిచెట్టుతండా గ్రామపంచాయతీలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటు సారాకు బానిసలుగా మారొద్దని, సారా తాగడం ద్వారా కలిగే దుష్ప్రభావాలను గ్రామస్తులకు తెలియజేశారు. సారాకు బానిసలుగా మారి ఎంతో మంది కుటుంబాలు పెద్ద దిక్కును కోల్పోయాయని గుర్తు చేశారు. సారాను మ్మినా, తయారు చేసినా చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఎవరైనా సారా తయారు చేసి అమ్మితే సమచారం అందించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు నేనావత్ శ్రీను నాయక్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

తిరుమలగిరి(నాగార్జునసాగర్): ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల చేపట్టాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వడ్త్య రాజు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని ఆయా పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను విద్యాశాఖ నుంచే నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎరనాగుల సైదులు, జిల్లా నాయకులు సైదయ్య, మండల ప్రధాన కార్యదర్శి మోతీలాల్, సంఘం నాయకులు జలీల్, శ్రీదేవి, రవీందర్ బాబు, నరేశ్‌చారి, కృష్ణవేణి, శైలజ, రెడ్యా నాయక్, రాజేష్ పాల్గొన్నారు.

బక్రీద్‌ను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి

మిర్యాలగూడ అర్బన్ : బక్రీద్‌ను శాంతి యుతంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని వన్‌టౌన్, టూటౌన్ సీఐ లు రాఘవేందర్, నరసింహారావు లు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ముస్లింలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పండుగలు సంస్కృతికి, సాంప్రదాయాలకు ప్రతీక అన్నారు. ప్రతి ఒక్కరూ సోదర భావంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐలు శ్రీనునాయక్, శివతేజ్, ఎస్.క్రిష్టయ్య, సైదిరెడ్డి పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీని వేగవంతం చేయాలి

మాడుగులపల్లి : రెండో విడుత గొర్రెల పంపిణీని ప్రభుత్వం వేగవంతం చేయాలని గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం మిర్యాలగూడ డివిజన్ అధ్యక్షుడు ఊరిబండి శ్రీనివాస్ యాదవ్ కోరారు. మండలంలోని కుక్కడం గ్రామంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులంతా డీడీలు చెల్లించినా పంపిణీలో జాప్యం జరుగుతుందన్నారు. గొర్రెల యూనిట్లను సకాలంలో పంపిణీ చేయలేని పరిస్థితి ఉంటే లబ్ధిదారులకు నగదు బదిలీ చేయాలన్నారు. ఆయన వెంట నాగరాజు, మల్లికార్జున్, శంకర్ యాదవ్, నాగయ్య, ముసలయ్య, శ్రీను పాల్గొన్నారు.